



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 328 | మంగళవారం 23 డిసెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## రాజకీయాలకు అతీతంగా అందుకు కృషి చేయండి..

### మంత్రి దామోదర పిలుపు



## రాచకొండలో ఈ ఏడాది పెరిగిన నేరాలు



## మహిళలకు గుడ్ న్యూస్.. త్వరలో మరో కొత్త పథకం!



## అదానీ అంబానీ మైనింగ్ కోసమే ఉపాధి హామీ చట్టం రద్దు

### సీతక్క సంచలన వ్యాఖ్యలు



## రాష్ట్రపతిని మేడారం మహాజాతరకు ఆహ్వానించిన రాష్ట్ర మంత్రులు



## దారి తప్పి బంగ్లాదేశ్ లోకి వెళ్లిన బిఎస్ఎఫ్ కానిస్టేబుల్.. సురక్షితం



## కులాంతర వివాహం.. కడుపుతో ఉన్న కన్న కూతుర్ని హత్య చేసిన తండ్రి



# అద్దె భవనాలకు చెక్..

## ప్రభుత్వానికి భారీ ఆదా లక్ష్యం

- ☑డిసెంబర్ 31 డెడ్‌లైన్ – జనవరి 1 నుంచి కొత్త నిబంధన అమలు
- ☑ప్రైవేటు అద్దె కొనసాగితే అధికారుల జేబుకే భారం
- ☑ఫిబ్రవరి 1 నుంచి అద్దె చెల్లింపులు నిలిపివేత
- ☑హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల వినియోగం
- ☑పీఎస్‌యూలు, యూనివర్సిటీలు, సొసైటీలకూ వర్తించే ఆదేశాలు
- ☑ఒకే ప్రాంగణంలో ప్రజలకు అన్ని సేవలు అందే అవకాశం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖజానాపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించే దిశగా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ కార్యాలయం కూడా ప్రైవేటు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కీలక ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ 31వ తేదీని తుది గడువుగా నిర్ణయిస్తూ.. కొత్త ఏడాది నుంచి పరిపాలన అంతా సొంత భవనాల్లోనే సాగాలని ఆదేశించారు.

మిగతా 2 లో



## అసెంబ్లీకి రమ్మంటే రావు.. మా తోలు తీస్తావా: మంత్రి పొన్నం



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉండి అసెంబ్లీకి రమ్మంటే రారు.. కానీ మా తోలు తీస్తారా అంటూ కేసీఆర్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్ల తర్వాత ఫామ్‌హౌస్ నుంచి వచ్చి ఏది పడితే అది మాట్లాడతామంటే ఊరుకోమని అన్నారు.

## కేసీఆర్ వ్యాఖ్యలు 100 శాతం కరెక్ట్ ఏపీ మాజీ మంత్రి అమర్‌నాథ్



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదివారం మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉమ్మడి పాలనపై విమర్శలు చేశారు. ప్రస్తుత రాష్ట్ర సీఎం చంద్రబాబు గతంలో ఉమ్మడి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన కొన్ని ఘటనలను గుర్తు చేస్తూ కేసీఆర్ సెటైర్లు వేశారు. విశాఖలో జరిగిన సమ్మిట్లపైనా ఆయన ఛలోక్తులు విసిరారు.

## ఆ సభకు రాలేకపోయా.. చాలా బాధపడ్డా

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** శ్రీకాకుళం లో జరిగిన సభలో పాల్గొనలేక పోయాయని బాధపడ్డానని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. భీమవరం లో నిర్వహించిన అటల్ మోదీ సుపరిపాలన యాత్ర సభలో ఆయన ప్రసంగించారు. శ్రీకాకుళంలో సభ జరుగుతున్న సమయంలో సీఎం చంద్రబాబు ఢిల్లీలో ఉండటంతో తానూ అక్కడే ఉన్నానని తెలిపారు. తాను అనేకసార్లు భీమవరం రావాలని అనుకున్నా అవకాశం రాలేదని, అటువంటిది భీమవరంలో వాజ్ పేయ్ విగ్రహం ఆవిష్కరణలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. వాజ్ పేయ్‌ని స్ఫూర్తిగా తీసుకుని పని చేస్తున్నానని చెప్పారు. భీమవరానికి ప్రత్యేకత ఉందని, పట్టణంలో ఉండే సంపద ఉన్నా, పల్లెల్లో ఉండే ఆప్యాయత, ప్రేమ, అనురాగాలు ఉన్నాయన్నారు.

"ప్రధాని మోడీ ఆధ్వర్యంలో భారతదేశం నేడు ప్రపంచంలో ఉన్నత దేశంగా కీర్తింపపడుతుంది. భారతీయుడు అంటే... తలెత్తుకుని సెల్యూట్ చేసే పరిస్థితి మన దేశానికి మోడీ కల్పించారు.

## చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీలు మార్చాడు

## సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** చొక్కాలు మార్చినంత ఈజీగా రేవంత్ రెడ్డి పార్టీలు మార్చాడని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే నిన్న కేసీఆర్ మీడియా ముందుకు వచ్చి ప్రజలకు వాస్తవాలు చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం జరిగిందని రేవంత్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సాక్షాత్తు ఇటీవల రేవంత్ ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికగా కొత్త రాష్ట్రమైన తెలంగాణ అదుతే ఆర్థిక ప్రగతి సాధించిందని టోనీ బ్లెయిర్, దువ్వూరి సుబ్బారావు ప్రశంసించడం నిజం కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలన గురించి రేవంత్ రెడ్డి పిలిచిన అతిథులే పొగడటం రుచించలేదా అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని అన్నారు. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో దేశానికే తలమానికంగా తెలంగాణను నిలిపారని గుర్తు చేశారు.

# తమిళనాడులో పొలిటికల్ హీట్

## విజయ్ రాజకీయాలపై శరత్ కుమార్ కీలక వ్యాఖ్యలు!



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** అసెంబ్లీ ఎన్నికల దగ్గర పడుతుండడంతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నటుడు, బీజేపీ నేత శరత్ కుమార్ అధికార డీఎంకే ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. మదురై తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించే అంశంలో జరుగుతున్న వివాదం పై ఆయన స్పందిస్తూ, రాష్ట్రంలో హిందువుల పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రస్తుతం తమిళనాడులో హిందువులు తాము హిందువులమని చెప్పుకోవడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. హిందువులు 'హిందూ' అనే పదాన్నే మర్చిపోతున్నారు. మతపరమైన ఆచారాలను పాటించడంలో కూడా వివక్ష ఎదురవుతోంది" అని శరత్ కుమార్ మండిపడ్డారు. మదురై దీపం వివాదం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు.

అలాగే రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికలపై శరత్ కుమార్ తన ప్రణాళికను స్పష్టం చేశారు. "2026 ఎన్నికల్లో తాను స్వయంగా పోటీ చేయనని, క్షేత్రస్థాయిలో ఉండి బీజేపీ కూటమి గెలుపు కోసం ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించడమే తన ప్రధాన లక్ష్యం" అని ప్రకటించారు. ఇదే సమయంలో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్ గురించి మాట్లాడుతూ.. "నేను విజయ్‌ను ఒక రాజకీయ నాయకుడిగా చూడటం లేదు. రాజకీయాల్లో ఎవరికి ఏ బాధ్యతలు ఇవ్వాలి, ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో కూడా ఆయనకు ఇంకా తెలియదు" అని వ్యాఖ్యానించారు. శరత్ కుమార్ చేసిన ఈ వ్యాఖ్యలు అటు డీఎంకే వర్గాల్లో, ఇటు విజయ్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. 2026 ఎన్నికలకు ముందే తమిళనాడులో సమీకరణాలు వేగంగా మారుతున్నాయని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

## నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం

### హైకోర్టును ఆశ్రయించిన ఈడీ




**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు ఇతరులపై రౌస్ అవెన్యూ ట్రయల్ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే, ప్రైవేటు వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పీఎంఎల్‌ఏ కింద చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని కోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా కేసులో వేసిన ఛార్జ్‌షీటు కూడా చట్టపరంగా నిలవదని డిసెంబర్ 16న న్యాయమూర్తి ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. ఈ క్రమంలోనే ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈడీ అధికారులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

కెరటం న్యూస్
మంగళవారం 23 డిసెంబర్ 2025

# అసెంబ్లీకి రమ్మంటే రావు.. మా తోలు తీస్తావా: కేసీఆర్‌కు మంత్రి పొన్నం కౌంటర్

తాము ప్రజల చేత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వాళ్లమని అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా గౌరవమిచ్చి శాసనసభకు రమ్మంటున్నామని.. సీఎం కూడా అదే చెప్పారని అన్నారు. అసెంబ్లీ స్పీకర్ కూడా పెద్దాయనకు ఏమాత్రం గౌరవం తగ్గకుండా సభను నడుపుదామని అన్నారని తెలిపారు. శాసనసభలో జరిగే చర్చతో రాష్ట్రానికి ఎవరు ఏం చేశారో ప్రజలే తేలుస్తారని అన్నారు.

కానీ, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించి.. మళ్లీ మా తోలు తీస్తామని అనడం పద్ధతి కాదన్నారు. ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల పూర్తి బాధ్యత ఉందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా బలహీనంగా ఉన్న అన్ని శాఖలపై సీఎం, మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. అన్ని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని కామెంట్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు కిరాయిలు కట్టకపోతే.. తాళాలు వేసే పరిస్థితి నుంచి పాత మెస్ బకాయిలు కట్టకపోతే కట్టుకుంటూ వస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ఏమైందో తెలుసని.. కుర్చీ వేసుకుని కట్టిస్తానని చెప్పిన గౌరవెల్లి ప్రాజెక్టు ఏమైందో అందరికీ తెలుసని మంత్రి పొన్నం ప్రభాకర్ చురకలంటించారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం.. హైకోర్టును ఆశ్రయించిన ఈడీ

అయితే, తాజాగా వేసిన ఈడీ ఛార్జ్‌షీటును ఢిల్లీ హైకోర్టు పరిగణలోకి తీసుకుని విచారణ చేపడుతుందా.. లేక ట్రయల్ కోర్టు మాదిరిగానే డిస్మిస్ చేస్తుందా అనేది హాట్ టాపిక్‌గా మారింది.

కాగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లు యంగ్ ఇండియన్ సంస్థలో 38 శాతం చొప్పున షేర్లు కలిగి ఉన్నారని ఈడీ ఆరోపించింది. ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.90.21 కోట్ల రుణాన్ని రూ.9.02 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చి.. ఆ షేర్లను రూ.50 లక్షలకు యంగ్ ఇండియన్‌కు బదిలీ చేశారని పేర్కొంది. తద్వారా రూ.2 వేల కోట్ల నుండి రూ.5 వేల కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులపై నియంత్రణ సాధించారని ఈడీ ఆరోపించింది. దీంతో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ సెక్షన్లు 3, 4, మరియు 70 కింద వారిపై ఛార్జిషీటు దాఖలు చేశారు. ఏప్రిల్ 11, 2025న ఈడీ ఢిల్లీ, ముంబై, లక్నోలలో రూ.661 కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులను సైతం ఆటాచ్ చేసిన విషయం తెలిసిందే.

# రాజకీయాలకు అతీతంగా అందుకు కృషి చేయండి.. నూతన సర్పంచ్‌లకు మంత్రి దామోదర పిలుపు

**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్?లు, ఉప సర్పంచ్‌లు గ్రామ వార్డు సభ్యులకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికై, నేడు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన నూతన గ్రామ పాలక కమిటీలకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీలే అత్యంత కీలకమైనవని, మహాత్మా గాంధీ కలలు కన్న 'గ్రామ స్వరాజ్యం' సాకారం కావడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో అమూల్యమని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత స్థానిక పాలకవర్గాలదేనని మంత్రి గుర్తుచేశారు. "మీ పదవీ కాలంలో గ్రామాల రోడ్లు, పరిశుభ్రత, పారిశుధ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. తద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టి, 'ఆరోగ్య తెలంగాణ' సాధనలో మీ వంతు సహకారం అందించాలని మంత్రి కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా చూడాలని సూచించారు. దేశానికి తెలంగాణ పల్లెలు ఆదర్శ, ఆరోగ్య గ్రామాలుగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.

# ఆ సభకు రాలేకపోయా.. చాలా బాధపడ్డా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మోదీ ఎంత కృషి చేసినా... ఆనాడు వాజ్ పేయ్ వేసిన పునాదే దీనికి నాంది అయ్యింది. ప్రజా స్వామ్యాన్ని కాపాడుకుంటూ.. ప్రజలకు నిరంతరం సేవ చేయడమే రాజకీయం అని ఆచరించి చూపిన నేత వాజ్ పేయ్. కాంగ్రెస్ యేతర ప్రధానిగా ఐదేళ్లు పాలన చేసిన వ్యక్తి వాజ్ పేయ్. 1999లో నేషనల్ ఫ్రంట్ ద్వారా అనేక పార్టీలను కలుపుకుని ప్రభుత్వాన్ని నడిపారు. వాజ్ పేయ్ వేసిన పునాదే.. నేడు ప్రాంతీయ పార్టీలకు ఊపిరి పోసింది. నేటి యువతరం కూడా వాజ్ పేయ్ గురించి తప్పకుండా తెలుసుకోవాలి." అని రామ్మోహన్ నాయుడు సూచించారు.

"13 రోజులు ప్రధానిగా చేసినా.. ఆ తర్వాత ఒక్క ఓటుతో పదవి పోతుందని చెప్పినా.. విలువలకు కట్టుబడి ఉన్నారు. నాకు అధికారం వద్దు.. ప్రజాస్వామ్యం గెలవాలని అని మాట్లాడిన వ్యక్తి వాజ్ పేయ్. నేటి రాజకీయాలతో చూడండి.. నేడు ఒక్క ఓటు కొనేందుకు కోట్లు కుమ్మరిస్తారు. ఎంపీలపై ఒత్తిడి తెచ్చి మద్దతు ఇచ్చేలా చేస్తారు. కానీ ఆనాడు వాజ్ పేయ్ ఎటువంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారు. చిన్న వయసులోనే జైలుకు వెళ్లారు. ఎన్నో ఇబ్బందులు పడి అంచలంచెలుగా ఎదిగి సుదీర్ఘ ప్రయాణం తర్వాత ప్రధానిగా అవకాశం వచ్చింది.1999 -2004 మధ్య జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా రాష్ట్రాలను కలిపారు. నగరాల నుంచి పల్లెల వరకు రైతుల వరకు మహిళల వరకు రోడ్లు వేయాలని గ్రామీణ సడక్ యోజన తీసుకు వచ్చారు. ఆరోజుల్లో అణుబాంబ్ శక్తిగా కావాలనుకుంటే.. అగ్రదేశాలు ఒత్తిడి చేశాయి. కరుణామయుడు లాంటి వాజ్ పేయ్.. ఒక కవి.. ఆనాడు ప్రపంచం మొత్తం ఒత్తిడి తెచ్చినా.. ధైర్యంగా నిలబడి మా దేశానికి ఏం కావాలో అదే చేస్తామన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా.. అణుశక్తి దేశంగా భారతదేశాన్ని నిలిపారు." అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# కులాంతర వివాహం.. కడుపుతో ఉన్న కన్న కూతుర్ని హత్య చేసిన తండ్రి



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** వేరే సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ప్రేమించడమే కాకుండా ఆతడినే పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ తండ్రి దారుణానికి పాల్పడ్డాడు. గర్భిణి అని కూడా కనికరం లేకుండా అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. కర్నాటకలోని హుబ్బళ్లిలో జరిగిన ఈ దారుణ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మాన్య పాటిల్ (19) అనే అమ్మాయి అదే గ్రామానికి చెందిన మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ప్రేమించి ఈ ఏడాది మేలో పెళ్లి చేసుకుంది. తన తల్లిదండ్రులకు ఇష్టానికి విరుద్ధంగా ఈ పెళ్లి చేసుకున్నందునా తన కుటుంబ సభ్యుల నుంచి తనకు ప్రాణ హాని ఉందని భయపడిన మాన్య పాటిల్ గ్రామానికి100 కిలోమీటర్ల దూరంలో హావేరి జిల్లాలో తన భర్తతో నివసిస్తోంది. పరిస్థితి అంతా సద్దుమణిగింది అనుకుని ఇటీవలే ఆమె తన స్వగ్రామానికి తిరిగి వచ్చింది.అయితే తన కూతురు విషయంలో లోలోపల రగిలిపోతున్న మాన్య తండ్రి ప్రకాశ్ ఫక్కిర్ గోడా ఆదివారం సాయంత్రం కూతురు భర్త కుటుంబంపై ఇనుప పైపులు ఇతర ఆయుధాలతో దాడికి దిగాడు. ఇంట్లోకి చొరబడి అత్యంత కిరాతకంగా దాడి చేశారు. ఈ ఘటనలో ఆరు నెలల గర్భవతి అయిన మాన్యను రక్షించేందుకు ఆమె అత్తమామలు ప్రయత్నించినా విఫలమయ్యారు. తీవ్ర గాయాలతో మాన్య ప్రాణాలు కోల్పోయింది. ఆమె అత్తమామలకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. తండ్రికి భయపడి గ్రామానికి దూరంగా ఉన్న కూతురు చివరకు అదే తండ్రి చేతిలో చనిపోవడం గ్రామంలో విషాదం నింపింది. ఇక నిండు గర్భిణి అనే కనికరం లేకుండా వ్యవహరించిన తీరు అందరిని కలిచి వేసింది. ఈ ఘనటలో పోలీసులు ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు.

# కేసీఆర్ వ్యాఖ్యలు 100 శాతం కరెక్ట్: ఏపీ మాజీ మంత్రి అమర్‌నాథ్

**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదివారం మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉమ్మడి పాలనపై విమర్శలు చేశారు. ప్రస్తుత రాష్ట్ర సీఎం చంద్రబాబు గతంలో ఉమ్మడి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన కొన్ని ఘటనలను గుర్తు చేస్తూ కేసీఆర్ సెటైర్లు వేశారు. విశాఖలో జరిగిన సమ్మిట్లపైనా ఆయన ఛలోక్తులు విసిరారు. అయితే కేసీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలను మాజీ మంత్రి అమర్‌నాథ్ ఏకీభవించారు. వ్యక్తిగతంగా తాను సమర్థిస్తున్నట్లు మీడియా ముఖంగానే ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబుపై కేసీఆర్ చేసిన విమర్శలు 100 శాతం కరెక్ట్ అని వ్యాఖ్యానించారు. పబ్లిసిటీ, మార్కెంటింగ్, ప్రతిపక్షాలపై అన్యాయంగా కేసులు పెట్టడం వంటివి తప్ప చంద్రబాబు చేసిందేమీలేదన్నారు. కేసీఆర్ వ్యాఖ్యల్లో ఏ ఒక్క చిన్న తప్పు కూడా లేదనని వెల్లడించారు. ప్రతిపక్షాలను అణగతొక్కడం తప్ప, తనపై మితిమీరిన ప్రచారం చేసుకోవడం తప్ప, చంద్రబాబు చేస్తున్నది ఏమీ లేదని మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ విమర్శించారు.

# చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీలు మార్చాడు సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్

రాష్ట్రంలో మూడు రెట్లు జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరగడం వాస్తవం కదా అని హరీశ్ రావు అన్నారు. రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. సొంత పార్టీ నేతలనే తొక్కుకుంటూ పెరిగినట్లుగా రేవంత్ రెడ్డే చెప్పారని.. రూ.50 కోట్లు పెట్టి పీసీసీ చీఫ్ కొనుగోలు చేసినట్లుగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బయట పెట్టాడని గుర్తు చేశారు. నిజాయితీగా త్యాగాల పునాదుల మీద ఎదిగిన నాయకత్వం తమదని.. పుట్టుక, చదువు, నౌకరీ ఒకే చోట చేస్తున్నారని, రేపు ఎక్కడో తెలియదంటూ సెటైర్లు వేశారు. ఎమ్మెల్యే, మంత్రి పదవులు గడ్డిపరకల్లా త్యాగం చేసింది బీఆర్ఎస్ నాయకులని.. చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీలు మార్చిన చరిత్ర రేవంత్ రెడ్డిది అని అన్నారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టగానే వెంటనే రేవంత్ రెడ్డి చిట్‌చాట్ పెట్టడం.. ఆయన ఎంత మరుగుజ్జు మనస్తత్వంతో ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నాడో అర్థం అవుతుందని హరీష్ రావు ఫైర్ అయ్యారు.

# రాచకొండలో ఈ ఏడాది పెరిగిన నేరాలు 2025 క్రైమ్ వార్షిక నివేదికలో కీలక విషయాలు

**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం నేరాల సంఖ్య పెరిగినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు చెప్పారు. ఇవాళ రాచకొండ 2025 క్రైమ్ వార్షిక నివేదికను ఆయన వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో గత ఏడాది 28,626 కేసులు నమోదు కాగా, 2025లో 33,040 కేసులు నమోదు అయినట్లు చెప్పారు. దోపిడీ 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీ 589 , వాహనాల చోరీలు 876 , సాధారణ చోరీలు 1, 161, హత్యలు 73 , అత్యాచారలు 330 , వరకట్నం చావులు 12, గృహ హింస కేసులు 782 నమోదైనట్లు వివరించారు. కిడ్నాప్ కేసులు, ఫోక్సో కేసులు సంఖ్య కూడా పెరిగిందని ఈ సంవత్సరం 579 కిడ్నాప్ కేసులు, 1224 ఫోక్సో కేసులు నమోదయ్యాయని, మర్డర్ ఫర్ గెయిన్ కేసులు 3 నమోదైనట్లు తెలిపారు.

మహిళలపై నేరాలు హైక్: గత ఏడాదితో పోలిస్తే మహిళ పై నేరాలు సంఖ్య 4 శాతం పెరిగిందని ఈఏడాది 20 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో 668 మంది నిందితులు అరెస్ట్ చేశామన్నారు. 256 డ్రగ్స్ కేసులు నమోదు చేసి ఇందులో 2090 కిలోల గంజాయి, 35 కిలోల గంజాయి చాక్లేట్లు, 34 కేజీల హ్యాష్ ఆయిల్, 216 గ్రాముల ఎండీఎంఏ , 10 కిలోల ఓపీఎస్, 242 గ్రాముల హెరాయిన్ , 35 కిలోల గసగసాల సామాగ్రి సీజ్ చేసినట్లు చెప్పారు.

పెరిగిన కన్విక్షన్ రేటు

ఎక్సైజ్ యాక్ట్ కింద 656 కేసులు నమోదు చేసి 689 మంది అరెస్ట్ చేశామన్నారు. 6824 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. గేమింగ్ యాక్ట్ కింద 227 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. 1,472 మంది అరెస్ట్ చేసి 69 లక్షల ప్రాపర్టీ సీజ్ చేశామన్నారు. మానవ అక్రమా రవాణా కింద ఈ ఏడాది 73 కేసులు నమోదు చేశామని 8 స్థావరాలు గుర్తించామన్నారు. ఈ ఏడాది 5, 647 కేసుల్లో 146 మందికి జైలు శిక్ష ఖరారైందని గత ఏడాది తో పోలిస్తే 74 శాతం కన్విక్షన్ రేటు పెరిగిందన్నారు. ఈ ఏడాది స్పెషల్ ఆపరేషన్ టీమ్ 186 డ్రగ్స్ కేసుల్లో 356 మంది అరెస్ట్ చేసిందని

తగ్గిన సైబర్ క్రైమ్ కేసులు: గత ఏడాదితో పోలిస్తే సైబర్ క్రైమ్ కేసులు తగ్గినట్లు సీపీ వెల్లడించారు. గత ఏడాది 4618 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 3734 కేసులు నమోదయ్యాయని, ఆపరేషన్ ముస్కాన్ కింద 2479 మంది ని రెస్క్యూ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ 1071 మంది రెస్క్యూ చేశామన్నారు. గత ఏడాది తో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిందని గత ఏడాది 3207 కేసులు నమోదు కాగా, ఈఏడాది 3488 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 659 మందిమృతి చెందారని వివరించారు. కమిషనరేట్ పరిధిలోని ఓఆర్ఆర్ పై జరిగిన ప్రమాదాల్లో 37 మంది మృతి చేందారన్నారు.

# మహిళలకు గుడ్ న్యూస్.. త్వరలో మరో కొత్త పథకం!

**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. మహిళా సంఘాల ఆర్థిక సాధికారత లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద విజయ డెయిరీ పార్లర్లను మహిళలకు కేటాయించేందుకు సిద్ధమైంది. ఈ పథకం ద్వారా మండలానికి ఒకటి చొప్పున, మున్సిపాలిటీల్లో రెండు చొప్పున మహిళా సంఘాలకు విజయ డెయిరీ పార్లర్లు కేటాయించేలా అధికారులు ప్రణాళిక రచిస్తున్నట్టు సమాచారం. దీనిపై వారం పది రోజుల్లో విధివిధానాలను ఖరారు చేయనున్నారు. పార్లర్ కోసం మహిళా సంఘాలు పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్యకు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, స్థలం ఏర్పాటు అనంతరం రూ.5,000 చెల్లిస్తే పార్లర్ మంజూరు చేస్తారు. ఒక్కో పార్లర్ ఏర్పాటుకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుండగా, దీనికోసం ప్రభుత్వం లోన్లను అందించనుంది. అయితే ఈ పార్లర్లలో విజయ డెయిరీ ఉత్పత్తులైన పాలు, పెరుగు, పన్నీర్, వాటర్ బాటిళ్లు మాత్రమే అమ్మాల్సి ఉంటుంది. ఈ విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు వంటి కార్యక్రమాల ద్వారా మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ వచ్చిన ప్రభుత్వం.. ఈ డెయిరీ పార్లర్ల కేటాయింపుతో వారి జీవనోపాధి అవకాశాలను మరింత పెంచనుంది.

# రాష్ట్రపతిని మేడారం మహాజాతరకు ఆహ్వానించిన రాష్ట్ర మంత్రులు

**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరిందిన శ్రీ మేడారం సమ్మక్క సారమ్మ మహాజాతర వచ్చే సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నదని, ఈ జాతరకు రాష్ట్రపతి హోదాలో అమ్మవార్లను దర్శించుకోవాలని రాష్ట్ర మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ, అట్లూరు లక్ష్మణ్ కుమార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతికి అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మేడారం మహాజాతర సంప్రదాయాలకు అనుగుణంగా, సమ్మక్క తల్లి చీర, కంకణం, కండువా బంగారాన్ని రాష్ట్రపతికి అందచేశారు. అనంతరం మంత్రి సీతక్క మేడారం జాతర ఘనత, ఆదివాసీ సంస్కృతిలో దాని అపూర్వ స్థానం, సమ్మక్క సారలమ్మ తల్లుల పోరాట చరిత్ర, వారి త్యాగం, ప్రజల విశ్వాసం, భక్తి, మేడారం అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్రపతి వివరించారు. మేడారం జాతర విశేషాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అత్యంత ఆసక్తితో విని, ఈ మహా జాతరకు హాజరయ్యేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తానని తెలిపారు. రాష్ట్రపతి మంత్రులకు ఆప్యాయంగా నూతన వస్త్రాలను బహూకరించి ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని రాష్ట్రపతి అభినందించారు.

# అదానీ అంబానీ మైనింగ్ కోసమే ఉపాధి హామీ చట్టం రద్దు సీతక్క సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని తీసుకురావడం పట్ల మంత్రి సీత్కక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టానికి గాంధీ పేరు తీసేసి గాంధీని మరోసారి బీజేపీ హత్య చేసిందని, మళ్ళీ వెట్టి చాకిరి విధానాన్ని తేవాలని బీజేపీ ఆలోచిస్తోందని ఆరోపించారు. ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన సీతక్క అదానీ అంబానీ మైనింగ్ తవ్వకాలకు కూలీలను సరఫరా చేసేందుకు ఉపాధి హామీ చట్టం రద్దు చేశారని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత మనందరిదని ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని గ్రామాల్లో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. 27 లేదా 28 తేదీల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. వలసలు తగ్గించేందుకు, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం గత యూపీఏ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టం తెస్తే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టానికి ఉరేసిందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం ప్రతి సంవత్సరం పని దినాలను తగ్గిస్తూ వస్తోంది. సొంత ఊర్లో పని హక్కు లేకుండా బీజేపీ చేస్తోందన్నారు. ఉపాధి చట్టాన్ని రద్దు చేస్తే గ్రామాల్లో కూలీలకు పని ఉండదని ఆ కూలీలు తక్కువ కూలికే కార్పొరేట్లకు లభిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను అందరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రం బిక్షగా కాకుండా ఉపాధి హక్కుగా లభించే విధంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని అందరూ కాపాడుకోవాలన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి:

గ్రామ ప్రజాస్వామ్యానికి బలం చేకూర్చే విధంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొంది నేడు పదవి బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నమ్మకంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన దిశగా బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. గ్రామాలే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్న మంత్రి..సర్పంచులు వార్డు సభ్యులు సమిష్టిగా పనిచేస్తేనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందనీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపే నాయకత్వం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, ప్రజాప్రతినిధులు ధైర్యంగా ముందుకు సాగాలని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

# దారి తప్పి బంగ్లాదేశ్ లోకి వెళ్లిన బిఎస్ఎఫ్ కానిస్టేబుల్.. సురక్షితం



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలో భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వద్ద పశువుల స్మగ్లర్లను వెంబడిస్తూ బిఎస్ఎఫ్ కానిస్టేబుల్ తప్పిపోయిన విషయం తెలిసిందే. అయితే ఆ రోజు ఆ జవాన్ సురక్షితంగా భారతదేశానికి తిరిగి వచ్చారు. బిఎస్ఎఫ్ 174వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ వేద్ ప్రకాష్, ఆదివారం తెల్లవారుజామున స్మగ్లింగ్ ప్రయత్నాన్ని అడ్డుకునే క్రమంలో పొరపాటున అంతర్జాతీయ సరిహద్దు దాటి బంగ్లాదేశ్ భూభాగంలోకి ప్రవేశించారు. ఆ సమయంలో సరిహద్దు ప్రాంతంలో దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో కనుచూపు మేర ఏమీ కనిపించకపోవడమే ఈ పొరపాటుకు ప్రధాన కారణమని అధికారులు వెల్లడించారు.

కానిస్టేబుల్ బంగ్లాదేశ్ భూభాగంలోకి రాగానే అక్కడి సరిహద్దు బలగాలు ఆయనను అదుపులోకి తీసుకున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన బిఎస్ఎఫ్ ఉన్నతాధికారులు వెంటనే బంగ్లాదేశ్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం తీన్ బిఘా కారిడార్ వద్ద ఇరు దేశాల భద్రతా బలగాల మధ్య జరిగిన 'ఫ్లాగ్ మీటింగ్' తర్వాత కానిస్టేబుల్‌ను బిజిబి అధికారులు క్షేమంగా బిఎస్ఎఫ్‌కు అప్పగించారు. వాతావరణ పరిస్థితుల వల్ల జరిగిన ఈ పొరపాటును అర్థం చేసుకున్న అధికారులు, ఎటువంటి ఉద్రిక్తతలు లేకుండా ఈ సమస్యను పరిష్కరించారు.

# అద్దె భవనాలకు చెక్.. ప్రభుత్వానికి భారీ ఆదా లక్ష్యం

ప్రభుత్వ నిర్ణయం కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా.. కఠినమైన ఆర్థిక నిబంధనలను కూడా విధిస్తోంది. డిసెంబర్ 31 లోపు ప్రైవేటు భవనాలను ఖాళీ చేసి.. అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లోకి మారాలి. ఫిబ్రవరి 1 నుంచి ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లింపులను నిలిపివేయాలని ట్రెజరీ విభాగానికి సర్క్యులర్ జారీ అయింది. గడువు దాటిన తర్వాత కూడా అద్దె భవనాల్లోనే కొనసాగితే... ఆ అద్దెను సంబంధిత శాఖాధికారి తన వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత హైదరాబాద్ నగరంలో తెలంగాణ ప్రభుత్వానికి భారీగా భవన సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ తన కార్యాలయాలన్నింటినీ అమరావతి, విజయవాడకు తరలించడంతో రాజధానిలో కీలకమైన భవనాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం పరిశ్రమ భవన్, గగన్ విహార్ కాంప్లెక్స్, బీఆర్కే భవన్ , ఎర్రమ్ మంజిల్ వంటి ప్రతిష్టాత్మక భవనాల్లో తగినంత స్థలం అందుబాటులో ఉంది. ప్రభుత్వ విభాగాలే కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు కూడా ఈ నిబంధనను పాటించాల్సి ఉంటుంది.

ప్రతి ఏటా ప్రభుత్వం అద్దె రూపంలో కోట్లాది రూపాయలను ప్రైవేటు భవన యజమానులకు చెల్లిస్తోంది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఆదాయం వృధా కాకుండా కాపాడవచ్చు. సొంత భవనాలు ఖాళీగా ఉండగా.. అద్దె భవనాల కోసం ప్రజా ధనాన్ని వెచ్చించడం సరికాదని ప్రభుత్వం భావిస్తోంది అన్ని కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోకి మారడం వల్ల ప్రజలకు కూడా ఒకే ప్రాంగణంలో వివిధ సేవలందే అవకాశం ఉంటుంది.

అన్ని శాఖల ప్రత్యేక కార్యదర్శులు, విభాగాధిపతులు వెంటనే తమకు అనువైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించి.. బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క ప్రభుత్వ బోర్డు కూడా ప్రైవేటు భవనంపై కనిపించకూడదన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనపడుతోంది.

# కారు బాంబు పేలుడులో రష్యన్ జనరల్ మృతి



**న్యూస్ డెస్క్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** రష్యా రాజధాని మాస్కోలో కారు బాంబు పేలుడు ఘటన జరిగింది. ఆ పేలుడు ఘటనలో రష్యన్ జనరల్ మృతిచెందినట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని దక్షిణ ప్రాంతంలో జరిగిన పేలుడు వల్ల భారీ సంఖ్యలో వాహనాలు దెబ్బతిన్నాయి. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ప్రమాదంలో మృతిచెందిన బాధిత వ్యక్తిని లెఫ్టినెంట్ జనరల్ ఫానిల్ సర్వరోవ్‌గా గుర్తించారు. జనరల్ స్టాఫ్ ఆపరేషనల్ ట్రైనింగ్ విభాగంలో ఆయన చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే వాహనం కింద భాగంగా పేలుడు పదార్థాన్ని అమర్చినట్లు అధికారులు చెప్పారు. ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సర్వీసు ఆ పేలుడుకు పాల్పడి ఉంటుందని రష్యన్ అధికారులు అంచనా వేస్తున్నారు. లెఫ్టినెంట్ జనరల్ సర్వరోవ్ వయసు 56 ఏళ్లు. సీనియర్ ఆఫీసర్ల శిక్షణ విభాగం బాధ్యతలను ఆయనకు 2016లో అప్పగించారు. గతంలో ఆయన రష్యా దళాల తరపున సిరియాలో పనిచేశారు.

కెరటం న్యూస్



# గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకం

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**చింతకాని, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మదుపల్లి అంబికా సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, ఖమ్మం డిసిసి మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గం లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారన్నారు.. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు భాధ్యతాయుతంగా పనిచేసి గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పన చేయాలని అన్నారు.

# మరోమారు మాట నిలబెట్టుకున్న మంత్రి పొంగులేటి

## జర్నలిస్టుల హక్కులకు కార్యాచరణ రూపం

## 48 గంటల్లోనే అక్రిడిటేషన్లపై జీవో జారీ



**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** మాట ఇచ్చిన వెంటనే కార్యాచరణకు దిగడం, ప్రకటించిన హామీని ఆలస్యం లేకుండా అమలు చేయడం ఇదే మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలనా శైలి అని మరోమారు రుజువైంది. టీడబ్ల్యూజెఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభ వేదికగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ పొందేందుకు అవసరమైన విధివిధానాలపై పది రోజుల్లో జీవో జారీ చేస్తాం అని ప్రకటించిన మంత్రి ఆ మాటకు మరింత విలువ చేకూర్చుతూ 48 గంటలు గడవక ముందే జీవోను విడుదల చేయించారు. ఈ వేగవంతమైన నిర్ణయం జర్నలిస్టుల హక్కుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు, మీడియాపై ఉన్న గౌరవానికి స్పష్టమైన నిదర్శనంగా నిలిచింది. ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ అంశానికి స్పష్టత రావడంతో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.మంత్రి పొంగులేటి ఇచ్చిన హామీ మాటలకే పరిమితం కాకుండా విధానాలుగా మారడంపై జర్నలిస్టు సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాట-చర్య మధ్య అంతరం లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్న మంత్రి తీరు ప్రశంసనీయం. ఇది జర్నలిస్టుల భవిష్యత్తుకు భరోసా" అని వారు వ్యాఖ్యానించారు. మీడియా సంక్షేమాన్ని పాలనా అజెండాలో ముందువరుసలో ఉంచుతూ, సమస్యలకు పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ నిర్ణయంతో మరోమారు జర్నలిస్టుల విశ్వాసాన్ని సంపాదించుకున్నారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

## తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా పనిచేస్తూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలని ఆయన సూచించారు. సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామంతో పాటు కూసుమంచి మండలంలోని కూసుమంచి, జీళ్లచెరువు, ధర్మ తండా, గొరీలపాడు తండా, గంగబండ తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులను అభినందించి, శాలువాలు కప్పి సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలతో ఎల్లప్పుడూ నిబద్ధతగా ఉంటుందని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందని దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వడ్డెబోయిన కు పుట్టిన రోజు శుభాకాంక్షలు



**ఖమ్మం టౌన్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు.. మాజీ కౌన్సిలర్.. తను ఎక్కడ వుంటే గెలుపు అక్కడే అతనే మా వడ్డేబోయిన నరసింహారావు కు శెట్టి రంగారావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వడ్డెబోయిన నరసింహారావు తను నమ్ముకున్న కాంగ్రెస్ జెండాను ఏనాడు వీడలేదని అందరి ఆప్త మిత్రులు మనందరి వాడు మన అన్న వడ్డేబోయిన నరసింహారావు అన్నకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు మరియు అనంతుల నరసింహారావు ఈ. సందర్భంగా నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

# కిలారు మనోహర్ ని సన్మానించిన డిసిసి అధ్యక్షులు నూతి



**చింతకాని, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** మండల కేంద్రంలో ని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ.సోమవారం సాయంత్రం చింతకాని లోని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు నివాసంలో డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ మరియు మాజీ డీసీసీ అధ్యక్షులు పూవాళ్ళ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మనోహర్ బాబు ని శాలువాతో సత్కరించారు. అనంతరం ఎన్నికల సరళి గురించి అడిగి తెలుసుకున్నారు. మనోహర్ బాబు పాలక వర్గ సభ్యులను పరిచయం చేసుకొని వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, కిలారు జగన్మోహనరావు, గాంధీనగర్ సర్పంచ్ వర్సు వీరభద్రం, కూరపాటి రాము వార్డు సభ్యులు వేముల కొండలరావు, కిలారు బాబూరావు, కోల ఉమారాణి, రహమతుల్లా, లక్ష్మణ్, షంషుద్దీన్, టీడీపీ జానిమియా, నాగరాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే శ్వాసగా పనిచేయండి

## సిపిఐ జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు



**చింతకాని, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** అభివృద్ధే శ్వాసగా పనిచేస్తే .. ప్రజలే తరతరాలు ఆదరిస్తారని సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం చింతకాని మండలం బస్వాపురం గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారాణికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గ్రామ వత్యేకాధికారిణి మానస నూతన పాలకవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాసాల మోహన్ రావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో పువ్వాడ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయం నుంచి బస్వాపురం సిపిఐ కంచుకోట అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎంతో కృషిచేశానని దాంతో ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికీ తనను ఆదరిస్తారన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని బస్వాపురం గత ఇరవై ఏళు ్లగా సిపిఐ గెలుస్తోందని తిరిగి మరలా ఐదవసారీ సిపిఐ గెలవడం అభినందనీయమన్నారు. రాజకీయలకతీతంగా అభివృద్ధి చేసి ప్రజలతో మమేకం అవ్వాలని నూతన పాలకమండలికి సూచించారు. కేక్ కట్ చేసి నూతన పాలకమండలికి తినిపించారు. అనంతరం గ్రామస్థులు పువ్వాడను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, పావులూరి మల్లిఖార్జునరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్ రావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నూతన సర్పంచ్ ఆవుల నర్సింహారావు, మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ, మాజీ సర్పంచ్లు రాసాల సాంబలక్ష్మి, బొడ్డు నుగుణమ్మ కొండలరావు, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, వార్డు సభ్యులు, సిపిఐ శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మాథ్స్ ఎగ్జిబిషన్-త్రివేణి



**ఖమ్మం ఎడ్యుకేషన్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో మ్యాథ్స్ ఎగ్జిబిషన్ జరిగింది. డిసెంబర్ 22వ తేదీన జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివేణి పాఠశాలలో జరుగుతున్న మ్యాథ్స్ వారోత్సవాల్లో భాగంగా ఈరోజు మాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగింది. ఈ వారం రోజులు గణితానికి సంబంధించి ఉపన్యాస పోటీలు, డ్రాయింగ్, గణితానికి సంబందించిన క్విజ్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ ఎగ్జిబిషన్లో విద్యార్థినీ విద్యార్థులు తయారుచేసిన అనేక రకాలైన వర్కింగ్ మోడల్స్ ని ప్రదర్శించారు పైథాగర సిద్ధాంతాన్ని వివరిస్తూ వర్గములను వర్గమూలాలను ఘన దీర్ఘ కణాల యొక్క మూలాలు వివరణలతో కూడిన వివిధ రకాలైన వర్కింగ్ మోడల్స్ ను విద్యార్థిని విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించడం జరిగింది 350 పైగా విద్యార్థులు ఈ గణిత శాస్త్ర ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కృష్ణవేణి కళాశాల గణిత శాస్త్ర ఐ ఐ టి అధ్యాపకులు రాంబాబు, నవీన్ లు న్యాయ నిర్ణీతలుగా గా వ్యవహరించి విద్యార్థులు చేసిన ప్రాజెక్టులపై పలు సూచనలు చేశారు ఈ ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను అభినందించి, విజేతలకి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలకు మూలమని, విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీసే అద్భుతమైన శాస్త్రమని, కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణిలో విద్యార్థుల సృజనాత్మక ప్రతిభకు ఎల్లప్పుడూ పదును పెడుతూనే ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏడి





**మధిర, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** మధిర వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న రైతుల్ని కొనుగోలు ఎలా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. తర్వాత రైతు వేదికలో రైతులతో యూరియా బుకింగ్ యాప్ గురించి మాట్లాడారు. గత వాన కాలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ యాప్ ను అమలులోకి తీసుకురావడం జరిగింది. రైతులు ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంటను బట్టి వారికున్న విస్తీర్ణాన్ని బట్టి జిల్లాలో ఏ డీలర్ అయినా ఏ సొసైటీలో అయినా అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకోవడం జరుగుతుంది. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ దగ్గరికి వెళ్లి కొనుగోలు చేయవచ్చు. ఏదైనా పరిస్థితులలో 24 గంటల లోపు యూరియాను తీసుకోనట్లయితే ఆ యొక్క బుకింగ్ రద్దు అవుతుంది మళ్లీ రైతులు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో పట్టాదారులు, పట్టా పుస్తకాలు లేని వాళ్ళు మరియు కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. కౌ లు దారులు అయితే వాళ్ళు ఎవరి దగ్గర అయితే కౌలుకు తీసుకున్నారు వారి యొక్క పట్టాదారు పాస్ బుక్ నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చు. అయితే ఆ పట్టాదారు ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్, ఏఈఓ సుష్మ మరియు ఖమ్మంపాడు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డెబోయిన జన్మదిన వేడుకలు





**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 25 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నరసింహ రావు 61 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినాము అని తెలియజేయుచున్నాము. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన నాయకులు కార్యకర్తలు అభిమానులు డివిజన్ ప్రజల సమక్షం లో కేక్ కట్ చేసి బాణసంచాలతో కాల్చి ఘనంగా పుష్ప గుచ్చం ఇచ్చి శాల్వా తో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలపటం నా పుట్టిన రోజున ఇటువంటి కార్యక్రమం నిర్వహించటం చాలా ఆనందం గర్వం గా ఉంది అని ఈ కార్యక్రమం నిర్వహింనటువంటి డివిజన్ కాంగ్రెస్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రముఖులు మహాకాళి చంద్రశేఖర్ మండేపూడి నోముల శ్రీనివాస్ రామారావు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు దాసరి పూర్ణ నాగిశెట్టి రాధాకృష్ణ నగర కాంగ్రెస్ నాయకులు మైనారిటీ అధ్యక్షులు ఎస్కే అబ్బాస్ మహమ్మద్ ఎస్టీ సెల్ నాయకులు డి వెంకట్రావు సంపటం నరసింహ రావు శెట్టి రంగరావు ఎ నరసింహ రావు వడ్డెబోయిన శంకర్ రాకొండే కృష్ణ కాజ కందికొండ శ్రీను తుమ్మూరు రామిరెడ్డి గంగిశెట్టి శ్రీను ఎలగందుల శ్రీనివాస్ ఎరువ కృష్ణమూర్తి గార్ల వెంకన్న నగర ఎస్సీ సెల్ నాయకులు మార్కపూడి నాగభూషణం పంది నరేష్ బొడ్డు మధు గట్టికొండ గురుమూర్తి ముదులఘర్ శ్రీనివాస్ గుజ్జరు శ్రీను సాయి వాసు మహమ్మద్ జాని గోజే వీరన్న అనిశెట్టి గిరి బాబు మారగాని వెంకట్ మారగాని రాంబాయి మహీ ప్రసాద్ వై ఉదయ్ కె. రమేశ్ కంబాల అచ్యుత ప్రసాద్ జోష్నా పంది ఉమా ఫర్జానా సైదాబి తదితరులు పాల్గొన్నారు.





# షైన్ హై స్కూల్ లో ఘనంగా మాథ్స్ డే సెలెబ్రేషన్స్

## ముఖ్య అతిథి గా భాగం సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగం రాకేష్





**బోనకల్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** సోమవారం స్థానిక షైన్ హై స్కూల్ లో మాథ్స్ డే సంబరాలు చాలా ఘనంగా జరిగాయి... చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు... వివిధ రకాల మాథ్స్ ప్రాజెక్ట్స్ చేసి అందరిని అబ్బుర పర్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా విచ్చేసిన భాగం రాకేష్ మాట్లాడుతూ, పిల్లలు చేసిన ప్రాజెక్ట్ వర్క్స్ ని మెచ్చుకున్నారు. పిల్లల్ని ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు... ఈ కార్యక్రమం లో భాగం సేవ ఫౌండేషన్ సభ్యులు రామి శెట్టి రవి, స్వర్ణాకర్,కరెస్పాండంట్ అన్సర్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, గణితం భోదకులు నాగుల్ మీరా, శాంత, మల్లేశ్వరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# నాగులవంచ గ్రామాభివృద్ధికి కృషి చేస్తా -అంబటి



**ఖమ్మం/చింతకాని, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** డిప్యూటీ సీఎం గౌరవనీయులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి సహకారంతో నాగులవంచ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చింతకాని మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

సోమవారం నాగులవంచ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచి అఖండ మెజారిటీతో సర్పంచ్‌గా నారగాని రాంబాయిని గెలిపించిన గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యదర్శి చిరంజీవి సర్పంచ్ నారగాని రాంబాయి, ఉప సర్పంచ్ అంబటి శరత్‌తో పాటు 11 మంది వార్డు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన సర్పంచ్ నారగాని రాంబాయి%-% శ్రీనివాసరావు దంపతులు ఉప సర్పంచ్ అంబటి శరత్ మరియు పాలకవర్గ సభ్యులు గువ్వల వీరయ్య, కంభం సునీత, చెట్టిపోగు నరేష్, బైరు రేణుక, గంధం ఇందిర, అనగాని జానకమ్మ, కాసాని బాలకుమార్, అన్నేపోగు రవి, మాగం వెంకటేశ్వరరావు, గురిజాల జయకుమార్, షేక్ ఖాసీం బీ లను గ్రామస్తులు, ప్రముఖులు శాలువలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచులు కంభం వీరభద్రం, ఆలస్యం నాగమణి, నాయకులు మడుపల్లి భాస్కర్, ఆలస్యం బసవయ్య, వెచ్చ మంగపతిరావు, ముత్తినేని వెంకటేశ్వరాలు, కొమ్మినేని వెంకటేశ్వరాలు, సిలివేరు సైదులు,బొర్రా ప్రసాద్, సామినేని అప్పారావు, వంకాయలపాటి సత్యనారాయణ, యరదేశి వినోదా, ఇమ్మడి కాశయ్య, వంకాయలపాటి లచ్చయ్య, ఆలస్యం రవి, గుడిపూడి మాధవరావు, ఏటుకూరి రవి, పసుపులేటి శ్రీనివాసరావు, తేలుకుంట్ల శ్రీనివాసరావు, డాక్టర్ నారగాని రాంప్రసాద్, గుడిపూడి తాజుద్దీన్ బాబా, బైరబోయిన హనుమంతురావు ,ప్రభుత్వ అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం

## మందడపు శ్రీనివాసరావు



**ఖమ్మం లీగల్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్ న్యాయవాది, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు శ్రీనివాసరావు సమావేశంలో పాల్గొని ఖమ్మం బార్ ను ఉద్దేశించి మాట్లాడుతూ బార్ కౌన్సిల్ లో న్యాయవాదుల సంక్షేమం నికి పాటుపడతానని చెప్పారు. యువ న్యాయవాదులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం, హెల్త్ కేర్ బెనిఫిట్స్ కోసం ముందు ఉండి పని చేస్తానని అన్నారు, రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాని అన్నారు. రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బార్ కౌన్సిల్ మెంబర్ గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సీనియర్ న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, ఏడునూతల శ్రీనివాసరావు, ఐలు కార్యవర్గం, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఖమ్మం మున్సిపల్ మేయర్ స్థానం ఎస్సీ కమ్యూనిటీకి కేటాయించాలి :బహుజన జెఏసి



**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** మునిసిపల్ చైర్పర్సన్ , మేయర్ పదవులు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు అయిన నాటు నుండి ఈరోజు వరకు అన్ని సామాజిక వర్గాల నుండి ప్రాతినిధ్యం వహించారని , ఈసారి ఎస్సీ సామాజిక వర్గానికి మేయర్ పదవికి అవకాశం కల్పించాలని బహుజన జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎస్సీ కమ్యూనిటీకి సంబంధించిన ఏ ఒక్కరికి కూడా ఇప్పటివరకు మునిసిపల్ కార్పొరేషన్ చైర్మన్ గా అవకాశం ఇవ్వకపోవడం చాలా బాధాకరమైన విషయం అని ,ఇది సమ సమాజ న్యాయానికి విరుద్ధంగా ఉన్నట్లుగా మేము భావిస్తున్నాం మని బహుజన చేసిన నాయకులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ , డి ఆర్ ఓ , మున్సిపల్ కార్పొరేషన్ ఆసిస్టెంట్ కమిషనర్లకు ఈ మేరకు ప్రతి పత్రాలను సమర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పద్ధతిలో చూసినా కూడా జనాభా దామాషా ప్రకారం గాని, రొటేషన్ పద్ధతిన గాని ఎస్సీ వర్గానికి అవకాశం లభించలేదు. ఇది ముమ్మాటికీ వివక్షగా , ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా భావించాల్సిన అంశంగా ఉన్నద న్నారు.



రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ విషయంతో అన్నివర్గాలను కలుపుకుపోతున్న విషయం ఉన్నందున ఈ దఫా తప్పనిసరిగా ఖమ్మం మేయర్ గా ఎస్సీ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకొని రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ గా ఎస్సీకి రిజర్వ్ చేసి , సామాజిక న్యాయం పాటించాలని , ఎస్సి వ్యక్తిని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా నియమించాలని ,ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనారిటీ కుల ప్రజా సంఘాల ఐక్యవేదిక జేఏసీగా తాము అధికారుల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామనీ వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన బృందంలో బహుజన జేఏసీ నాయకులు సంజీవరావు( తెలంగాణ దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కన్వీనర్,) బద్రు నాయక్ (లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు), దాసరి శ్రీనివాస్( మాల మహానాడు అధ్యక్షులు), జై భీమ్ నారమళ్ళ (అంబేద్కర్ సంఘం,) పి నాగేశ్వరరావు (దళిత సంఘాల ఐక్యవేదిక,) కామా ప్రభాకర్ రావు (మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు,) రామటెంకి అశోక్( నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,) సంతోష్ యాదవ్,(యాదవ సంఘం అధ్యక్షులు,) ఎస్.కె బాజీ, (మహాజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, )కోరిపల్లి శ్రీనివాస్ (అధ్యక్షులు మాదిగ హక్కుల దండోరా, )పెళ్లూరి విజయ్ కుమార్ (జ్యోతిరావు పూలే ఐడియాలజీ సొసైటీ అధ్యక్షులు. ) రోజా బహుజన జెఎసి (మహిళా నాయకురాలు.), కొప్పుల గీత, కిషన్ నాయక్, సిహెచ్ వెంకటేశ్వర్లు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ గా పదవీ ప్రమాణం స్వీకారం చేసిన ప్రభు




**చింతకాని, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** చింతకాని మండలపరిధిలోని తిమ్మినేనిపాలెంగ్రామ నూతన సర్పంచ్ గా కొమ్ము ప్రభు పదవీ ప్రమాణం స్వీకారం చేసి, పదవిబాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శశికళ నూతన సర్పంచ్ ప్రభు, ఉపసర్పంచ్ బుచ్చిబాబు మరియు వార్డు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ బాధ్యతను, తన కర్తవ్యాలను అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని ఆయన అన్నారు. సోమవారం నిర్వహించిన తొలిసమావేశంలో గ్రామంలో పెండింగ్ పనులపై దృష్టి సారించి త్వరలో పూర్తిచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పాలన అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని, ప్రజలకు జవాబుదారీగా ఉంటామని స్పష్టం చేశారు. సర్పంచ్ ను పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు హనుమంతరావు, మీరాసాబ్, బాబు ఆదిలక్ష్మీ, మమత గ్రామ పెద్దలు దమ్మాలపాటి జగన్మోహన్ రావు, బి ఆర్ యస్ నాయకులు పోటు నాగేశ్వరరావు, నాదెండ్ల వెంకటేష్, ఆశా కార్యకర్తలు లక్ష్మీ, మంజుల, అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి, పంచాయతీ కార్మికులు యాకూబ్, యేసోబు తదితరులు పాల్గొన్నారు.



# మాథ్స్ ఎక్స్ పో ప్రారంభించిన డా.రమేష్ రెడ్డి సర్వజ్ఞలో ఘనంగా 'జాతీయ గణిత దినోత్సవం



**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం పట్టణం, వీడిఓస్ కాలనీలోని ప్రముఖ విద్యాసంస్థ సర్వజ్ఞ పాఠశాలలో 'జాతీయ గణిత దినోత్సవ' వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ వైద్య నిపుణులు, ఇండస్ హాస్పిటల్స్ అధినేత డా.రమేష్ రెడ్డి అల్లంపాటి హాజరయ్యారు. పాఠశాల గణిత విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మ్యాథ్స్ ఎక్స్‌పో గణిత కళాకృతులు మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలు మరియు ప్రాజెక్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ గణితం పట్ల ఆసక్తి పెంచుకోవాలి, ప్రపంచ గణిత శాస్త్ర రంగంలో రామానుజన్ వేసిన ముద్ర చెరిపివేయలేనిదని కొనియాడారు. మన నిత్యజీవితంలో గణితం ఒక భాగమని, విద్యార్థులు గణితాన్ని భయం లేని సబ్జెక్టుగా కాకుండా, ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ సంధర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ నీలిమ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం 2012లో అధికారికంగా ప్రకటించింది, 2011లో రామానుజన్ 125వ జయంతి సందర్భంగా ప్రధాని మన్మోహన్ సింగ్ దీనిని ప్రకటించారు. ఈ రోజున, గణితం కేవలం పాఠ్యాంశం కాదని, అది సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంచుతుందని, రోజువారీ జీవితంలో, సైన్స్, కళ వంటి అన్ని రంగాలలో కీలకమని,గణితంలో ఉన్న సూత్రాలను, చిక్కుముడులను ఛేదించడం ద్వారా మెదడుకు పదును పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ , ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# క్రీస్తు సందేశాన్ని నిజజీవితంలో ఆచరించాలి

## ఏలూరి శ్రీనివాసరావు




**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ ఉత్సవాలను కొంగర వెంకటేశ్వరరావు అధ్యక్షులు, మోదుగు వేలాద్రి సెక్రెటరీ ఆధ్వర్యంలో టీజీవో భవన్ నందు నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో కేంద్ర సంఘం అధ్యక్షులు, టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్ హాజరైనారు. క్రీస్తు సమస్త జనుల పాపాలను తీసివేయుటకు మానవ రూపంలో డిసెంబర్ 25న జన్మించారని, మానవుడు ఏ విధంగా నడుచుకోవాలో తను ఆచరించి చూపించారని అందరి పట్ల కరుణ జాలితో వ్యవహరించారని, నీతి నిజాయితీతో ఎదిగారని, ఎందరినో ఆరోగ్యవంతులుగా మార్చారని తన మీద ఆరోపణలను చేసిన వారిని కూడా క్షమించారని వారి పాపాలను తన రక్తము ద్వారా శుద్ధి చేశారని వివరించారు, నేటి కాలంలో అందరూ ఆయన సందేశాన్ని ఆచరిస్తూ శాంతి సౌభాతృత్వాన్ని నెలకొల్పాలని సోదరభావంతో మెలగాలని సూచించారు. కష్టాలలో ఉన్న వారికి సాయపడాలని అప్పుడే వ్యక్తిగతంగా అయినా సంఘపరంగా అయినా నిజమైన మనుషులుగా ఉండగలమని అభిప్రాయపడ్డారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఏలూరి శ్రీనివాసరావు గారు హిందూ ముస్లిం క్రైస్తవ అన్ని మతాలను వారి ఆచారాలను గౌరవిస్తూ ఉద్యోగులందరూ కలిసిమెలిసి ఉండటానికి ఖమ్మంలోని ఉద్యోగుల కాలనీలలో అన్ని దేవాలయాలను నిర్మించారని ఉద్యోగులకు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో పెద్ద దిక్కుగా ఉన్నారని వారు ఖమ్మం జిల్లా నుండి ఉండడం మన అదృష్టం అని చెప్పారు. కార్యక్రమం అనంతరం కేక్ కటింగ్ శ్రీ ఏలూరు శ్రీనివాసరావు గారు కట్ చేసి క్యాండిల్స్ తో ఏసుకు స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో టీజీవో కేంద్ర కమిటీ సభ్యులు కొండపల్లి శేష ప్రసాద్, జిల్లా కోశాధికారి సూరంపల్లి రాంబాబు, అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, గంగవరపు నరేందర్, హౌస్ బిల్డింగ్ సొసైటీ సెక్రటరీ డా. పి విజయ్ కుమార్, టీజీవో మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, టీజీవో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, కార్యదర్శి మహేష్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొనిదెన శ్రీనివాసరావు, రాష్ట్ర బాధ్యులు జైపాల్, గంగవరపు బాలకృష్ణ, ట్రెజరర్ వెంకన్న, మహిళా అధ్యక్షురాలు లలిత కుమారి, టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీమతి ఉషశ్రీ, సుధారాణి, విజయ కుమారి ,విజయలక్ష్మి ప్రమీల రాణి, తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి శ్రీనివాస్, శారద, మంజుల, జాన్ పాటిల్, గోపాలకృష్ణ, శంకర్, అరుణ కుమారి, బాలాజీ, భాస్కరరావు, తాజుద్దీన్, టీఎన్జీవో జిల్లా బాధ్యులు కొమరగిరి దుర్గాప్రసాద్, తాళ్లూరు శ్రీకాంత్, కోణార్, పెదినేని రాధాకృష్ణ, రమేష్ , తెలంగాణ రెవెన్యూ సంఘం అధ్యక్షులు సునీల్ రెడ్డి, పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ జిల్లా అధ్యక్షులు రాజేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, అధ్యక్షులు షేక్ రంజాన్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, మాజీ అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, రాష్ట్ర బాధ్యులు విజయ్, నాగిరెడ్డి, ఎస్ టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, జిల్లా బాధ్యులు మల్సూర్, హెచ్ఎంస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీరస్వామి, జాయింట్ రిజిస్టర్ రామకృష్ణారెడ్డి, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు సుబ్బయ్య, కార్యదర్శి వేణు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, అధ్యక్షులు గోపీచంద్, ఎస్ జి పి ఏ జిల్లా అధ్యక్షులు పరిష పుల్లయ్య, కార్యదర్శి రవికుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షులు సుధాకర్, ఎక్సైజ్ ఫోరం అధ్యక్షులు కృష్ణ, రాంప్రసాద్, లెక్చరర్స్ అసోసియేషన్ కొప్పిశెట్టి సురేష్, అల్లా విజయ్, భరత్, లైబ్రేరియన్స్ అసోసియేషన్ నక్క ప్రసాద్ బాబు, ఫణి కుమార్, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి వరప్రసాద్, ఎంపీడీవోస్ అసోసియేషన్ షేక్ సిలార్, ఎంపీఓస్ అసోసియేషన్ సూర్యనారాయణ, జి వెంకటేశ్వర్లు, ట్రెజరీ అధికారుల సంఘం మోదుగు వెంకటేశ్వరరావు ఎన్ వి కృష్ణారావు, సైదులు, నాగేంద్ర కుమారి, వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ గోపి జిల్లా బాధ్యులు కిరణ్, శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ అసోసియేషన్ సింహాచలం, నవీన జ్యోతి, సిపిఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద్రకంట శశిధర్, తెలంగాణ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు బిక్కు నాయక్, కార్యదర్శి వెంకటరమణ, డ్రైవర్ సంఘం జిల్లా బాధ్యులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, సలీం, కోటేశ్వరరావు, తదితరులు హాజరైనారు.








# క్రీస్తు ప్రేమను కలిగి ఉందాం

## చింతకాని సర్పంచ్ మనోహర్ బాబు

**చింతకాని, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** చింతకాని ఆర్సిఎం చర్చి లో జరుగుతున్న సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, ఫాదర్ శౌరి మరియు వార్డు సభ్యులు. ఈ సందర్భంగా కిలారు మనోహర్ బాబు మాట్లాడుతూ యేసు క్రీస్తు యొక్క ప్రవచనాలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని పొరుగు వారిని కూడా ప్రేమించాలి అని చెప్పిన వ్యక్తి ఏసుక్రీస్తు అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ యేసు క్రీస్తు ప్రేమలో జీవించాలని కోరారు.



# గ్రూప్ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** ప్రభుత్వ వ్యవస్థ పై నమ్మకాన్ని పెంచుతూ కొత్తగా నియమితులైన ఉద్యోగులు జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రజలకు విశిష్ట సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రభుత్వ బీసీ సడ్డీ సర్కిల్ నందు గ్రూప్ ఉద్యోగాలకు శిక్షణను తీసుకొని పోటీ పరీక్షలలో ప్రతిభ కనబర్చి మెరుగైన ర్యాంకులతో గ్రూప్ 3, గ్రూప్ 4 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు సోమవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు కలెక్టర్ కు పూలమొక్కలను అందించి మర్యాదపూర్వకంగా కలిసారు. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులుగా నియమకం అయిన వారిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోస్టింగ్ ఎక్కడ వచ్చిన మంచి పని చేస్తే గుర్తింపు వస్తుందని, ఉత్తమంగా పనిచేస్తున్న వారికి ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. ఉత్తమ సేవలతో పనిచేసే శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు చేసేందుకు బాధ్యతతో పనిచేయాలని, మీపై అధికారులతో కలిసి వృత్తి పట్ల, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, ఉత్తమ సేవలతో అందరి అభిమానం పొందుతూ మంచి పేరు తేచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ బీసీ స్టడీ సర్కిల్ లో ఉత్తమైన శిక్షణ తీసుకొని దానికి పట్టుదల జోడించి చదువుకొని పోటీ పరీక్షలలో విజయం సాధించడం గర్వకారణం అని అన్నారు. ఉద్యోగం సాధించమని ఇక్కడితో ఆపకుండా ఉన్నత స్థానాలకు చేరుకుని ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విజయం కోసం మాత్రమే పని చేస్తే మంచి ఫలితాలు రావాలని, మనం చేసే ప్రతి పని అద్భుతంగా చేసినప్పుడు ఆటోమేటిక్ గా విజయవంతం అవుతామని అన్నారు. మనం చేసే ప్రతి పనిలో 100 శాతం మనం దృష్టి పెట్టాలని అన్నారు. మనకు సమాజం నుంచి నేర్చుకున్న పాఠాలు సరి చేసుకుంటూ పని చేస్తే విజయం సాధిస్తామని అన్నారు . ప్రతి ఒక్కరూ ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని పెట్టుకొని, దానినీ సాధించే దిశగా కృషి చేయడం వలనే మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. అనంతరం నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వారిని కలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ ప్రమాణ స్వీకారం

## ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధు





**ఖమ్మం బ్యూరో, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** పిండిప్రోలు గ్రామపంచాయతీ మరియు కేశవపురం గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ , ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ,ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ గారు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలు పార్టీపై, తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా గ్రామ ప్రగతి – ప్రజా సంక్షేమమే లక్ష్యంగ పనిచేయాలని, గ్రామ అభివృద్ధి, ప్రజల హక్కుల కోసం ఎంతటి పోరాటమైనా కొనసాగించాలని సూచించారు. పార్టీ నాయకత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ ప్రముఖులు, నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 48 గంటల్లోనే అక్రిడిటేషన్ల జీవో జారీ

### టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభలో హామీని నిలుపుకున్న మంత్రి పొంగులేటి

### ఫెడరేషన్ నేతల హర్షం.. మంత్రికి కృతజ్ఞతలు

### అర్హులందరికీ అక్రిడిటేషన్లు అందేలా చర్యలు



**ఖమ్మం టౌన్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్):** టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా 4వ మహాసభలు వేదికగా రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఇచ్చిన హామీని 48 గంటల్లోపే నిలుపుకున్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ మరో పదిరోజుల్లో అక్రిడిటేషన్ల జీవో జారీ చేస్తామని మాట ఇచ్చిన ఆయన 48 గంటల్లోనే నిలుపుకోవటంపై టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్ కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ నాయకులు నాగిరెడ్డి ఇంటి వద్ద నేలకొండపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ఖదీర్, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు సాగర్ మాట్లాడారు. యూనియన్ మహాసభల్లో పొంగులేటి ఇచ్చిన హామీ మేరకు 48 గంటలు గడవకముందే జీవో జారీ చేశారని హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. జీవోలో ఉన్న అంశాలను పరిశీలించిన తరువాత ఏమైనా అభ్యంతరాలుంటే మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా కొత్త అక్రిడిటేషన్ల ప్రక్రియ వివిధ కారణాలతో ఆలస్యమైనా టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మంత్రి ఇచ్చిన హామీని రెండు రోజుల్లో నిలబెట్టుకున్నారని తెలిపారు. జర్నలిస్టుల పక్షపాతి మంత్రి అని కొనియాడారు. వచ్చే నూతన సంవత్సరంలో ఇండ్ల స్థలాల విషయాన్ని కూడా తీపికబురుగా అందించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో యూనియన్ ఖమ్మం నగర కార్యదర్శి గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నేషనల్ కమిటీ సభ్యులు కందికొండ శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పీవీ నాగిరెడ్డి, పాలేరు డివిజన్ నాయకులు యన్. డి. కర్ణ, శ్రీనివాసరెడ్డి, నాయకులు తుమ్మా ఉపేందర్, అచ్యుత రామారావు, మైసా శ్రీనివాసరావు, దుద్దెల సంజయ్, మారేపల్లి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# శీతాకాల విడిది ముగించుకొని ఢిల్లీకి పయనమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



మేడ్చల్, 22 డిసెంబర్ (టీజీ24): ఈనెల 17న శీతాకాల విడిది కై హైదరాబాద్ వచ్చి వివిధ కార్యక్రమాలలో పాల్గొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరిగి ఢిల్లీకి బయలుదేరారు. సోమవారము రోజున తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పంచాయతీ రాజ్, మహిళాభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఐ.ఏ. స్ మహేష్ భగవత్ ఐ.పి.స్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐ.ఏ ఎస్ ., హకీంపేట ఎయిర్ఫోర్స్ స్టేషన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు ఘనంగా వీడ్కోలు తెలిపారు అనంతరం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ఢిల్లీకి బయలుదేరారు.

# సలార్-2'పై ప్రశాంత్ నీల్ బిగ్ క్లూ..



మూవీ న్యూస్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్): రెబల్ స్టార్ ప్రభాస్, మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో వచ్చిన 'సలార్' బాక్సాఫీస్ను షేక్ చేసిన సంగతి తెలిసిందే. ప్రభాస్ను మునుపెన్నడూ లేని పవర్ఫుల్ లుక్లో చూపించిన ఈ సినిమా రిలీజ్ అయి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయింది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఫ్యాన్స్ 'సలార్' ముచ్చట్లను మళ్లీ ట్రెండ్ చేస్తున్నారు. సినిమా వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు 'సలార్-2' (శౌర్యాంగ పర్వం) షూటింగ్ గురించి మేకర్స్ నుండి ఎలాంటి అధికారిక క్లారిటీ లేకపోవడంతో అభిమానులు కొంచెం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ వరుస సినిమాలతో బిజీగా ఉండటం, ప్రశాంత్ నీల్ కూడా తన తదుపరి ప్రాజెక్టులపై ద ృష్టి పెట్టడంతో సీక్వెల్ ఎప్పుడనేది హాట్ టాపిక్గా మారింది. అయితే, సలార్-2 గురించి గతంలో ప్రశాంత్ నీల్ ఇచ్చిన ఒక అదిరిపోయే అప్డేట్ ఇప్పుడు ఫ్యాన్స్కు ధైర్యాన్నిస్తోంది.

"సలార్-2 నా కెరీర్లోనే ది బెస్ట్ సినిమా అయ్యేలా ప్లాన్ చేస్తున్నాను. ఇప్పటివరకు నేను రాసుకున్న స్క్రిప్ట్ లో ఇదే అత్యుత్తమమైనది. ప్రేక్షకులు ఊహించని స్థాయిలో ఈ సీక్వెల్ ఉంటుంది" అని నీల్ భరోసా ఇచ్చారు. అంటే పార్ట్-1 కేవలం శాంపిల్ మాత్రమేనని, అసలు సిసలు యాక్షన్ పార్ట్-2లో ఉంటుందని ఆయన మాటలను బట్టి అర్థమవుతుంది. ఈ సినిమాలో ప ృథ్వీరాజ్ సుకుమారన్, శ ృతి హాసన్, జగపతి బాబు వంటి భారీ స్టార్ కాస్టింగ్ ఉండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నిర్మాతలు సైలెంట్గా ఉన్నా, లోపల మాత్రం పని గట్టిగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# రష్మిక 'మైసా' గ్లింప్స్ డేట్ లాక్.. కొత్త అవతారంలో నేషనల్ క్రష్

మూవీ న్యూస్, 22 డిసెంబర్ (కెరటం న్యూస్): నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం కెరీర్ పరంగా పీక్ స్టేజ్లో ఉన్నారు. 'పుష్ప 2' బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత ఆమె నుంచి రాబోతున్న మరో భారీ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' . ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్ర బ ృందం ఈ సినిమాకు సంబంధించిన ఒక క్రేజీ అప్డేట్ను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.

ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ను డిసెంబర్ 24, 2025న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా ద్వారా రవీంద్ర పూలే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన గతంలో స్టార్ డైరెక్టర్ హను రాఘవపూడి వద్ద అసిస్టెంట్గా పనిచేశారు.'కల్కి 2898 ఏడి' ఫేమ్ అంతర్జాతీయ స్టంట్ మాస్టర్ ఆండీ లాంగ్ ఈ చిత్రానికి హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్లను డిజైన్ చేస్తున్నారు. జేక్స్ బిజోయ్ అదుతేమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. కాగా తాజాగా విడుదల చేసిన పోస్టర్ లో రష్మిక చాలా పవర్ ఫుల్ లుక్ లో కనిపించింది. ఇక కథ విషయానికి వస్తే.. సమాచారం ప్రకారం

తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో నివసించే 'గోండు' తెగల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. హక్కుల కోసం పోరాడే ఒక వీరనారిగా, పవర్ఫుల్ మదర్ క్యారెక్టర్లో రష్మిక ఈ సినిమాలో కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ లో రష్మిక ముఖంపై రక్తపు మరకలతో, చేతిలో ఆయుధం పట్టుకుని చాలా ఇంటెన్స్గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. "ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి" అనే ట్యాగ్ లైన్ సినిమాలోని యాక్షన్ ఏ రేంజ్లో ఉండబోతుందో హింట్ ఇస్తోంది. మరి గ్లింప్స్ ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి.